సాక్షి సంగారెడ్డి

మంగళవారం ׀ 20 ׀ ఫిబ్రవరి ׀ 2024

సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు, వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజావాణికి మొత్తం 47 దరఖాస్తులు రాగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 17 వచ్చినట్లు తెలిపారు.

పాస్ బుక్ ఇవ్వాలి : మారుతి

ప్రభుత్వం అందించిన రెండెకరాల భూమికి పట్టా పాస్‌బుక్ ఇవ్వాలని నాగలిగిద్ద మండలం ఔదత్‌పూర్ గ్రామానికి చెందిన మారుతి ఫిర్యాదు చేశాడు.

పరిహార బిల్లు ఇవ్వట్లే



వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ స్తంభాలు నాటినందుకు ఇచ్చే పరిహారం ఇవ్వడం లేదని మొగుడంపల్లి మండలం దనిసిరి గ్రామానికి చెందిన మల్లికార్జున్ కలెక్టర్‌కు విన్నవించాడు. కొన్నేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని తెలిపాడు. – మల్లికార్జున్

ధరణిలో లేదు



తన భూమి ధరణిలో చూపించడం లేదని పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామానికి చెందిన మహ్మద్ యాసిన్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. అధికారులు నాగోడు పట్టించుకోవడం లేదని చెప్పాడు. – మహ్మద్ యాసిన్

● శౌర్యానికి మారుపేరు శివాజీ

జిల్లావ్యాప్తంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత ర్యాలీలు తీసి జై భవానీ.. జై శివాజీ.. అంటూ నినాదాలు చేశారు. శివాజీ శౌర్యానికి మారుపేరని పలువురు వక్తలు కొనియాడారు. సంగారెడ్డిలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. అనంతరం శివాజీ చౌక్ వద్ద అన్నదాన చేశారు. కార్యక్రమంలో హిందూ వాహిని, ఆర్‌ఎస్‌ఎస్, యువజన నాయకులు పాల్గొన్నారు. - సంగారెడ్డి టౌన్



శివాజీ విగ్రహంతో ఊరేగింపు

న్యూస్‌రీల్

అనాథ పిల్లలకు 'నీలం' ఆపన్నహస్తం



చిన్నారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: ముగ్గురు అనాథ పిల్లలకు కాంగ్రెస్ నేత, ఎన్‌ఎంఆర్ యువసేన అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ ఆపన్నహస్తం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గజ్వేల్ మండలం కోల్గూరు గ్రామానికి చెందిన నీరుడి భాస్కర్ డ్రైవర్ తోపాటు గ్రామ మస్కూరిగా పనిచేస్తూ ఉండేవాడు. ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మరణించాడు. కొద్ది రోజులకు భార్య కవిత కూడా మృతిచెందింది. వారికి ఉన్న ముగ్గురు పిల్లలు కావ్య(6), శ్రీవాణి(4), కుమార్(18 నెలలు) అనాథలుగా మారారు. సోమవారం కొల్గూర్‌లో చిన్నారులను నీలం మధు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. వారికి అండగా నిలబడాలని ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ముగ్గురి పేరుమీద రూ.లక్ష యాభై వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అంతే కాకుండా తక్షణ ఖర్చుల కోసం మరో రూ.50 వేలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మలం రాజు, ఎంపీటీసీ స్వామి, గుంటూరు శ్రీను, సత్యనారాయణ, రావుల, రాజు, ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సులను నియమించండి



డీఎంహెచ్‌ఓ వినతి పత్రం ఇస్తున్న శివశంకర్‌రావు

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలను పరిష్కరించాలని డీఎంహెచ్‌ఓ గాయత్రీ దేవికి సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బీవీ శివశంకర్ రావు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో నలుగురు పర్మినెంట్ స్టాఫ్‌నర్సులు అవసరం ఉండగా ఒక్కరే ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. అలాగే ఆపరేషన్ యంత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ సమస్యలపై కలెక్టర్ క్రాంతి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డిలకు కూడా విన్నవించినట్లు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

న్యాల్‌కల్(జహీరాబాద్): చెరకు సాగు విస్తీర్ణం పెంచడంతో పాటు అధిక దిగుబడులు వచ్చేలా కృషి చేస్తున్నామని బసంత్‌పూర్-మామిడ్గి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం చెరకు పంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముంగి, మిర్జాపూర్(ఎన్), గంగ్వార్, న్యాల్‌కల్ తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన చెరకు పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ.. అధిక దిగుబడులు ఇచ్చే 18121, 15012, 8005 రకాల చెరకు పంటలను సాగు చేయాలన్నారు. యాజమాన్య పద్ధతులు, మొక్కలు నాటడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు.

లెక్క తేల్చేందుకే..!

- ఆక్రమణలపై జిల్లా రెవెన్యూ శాఖ నజర్
- సర్కారు భూముల రికార్డుల వెరిఫికేషన్
- తొలి విడతలో హెచ్‌ఎండీఏ పరిధిలోని మండలాల్లో..
- రికార్డుల పరిశీలన అనంతరం ఫీల్డ్ విజిట్

ప్రభుత్వ భూముల కబ్జాపై రెవెన్యూ శాఖ దృష్టిసారించింది. సర్కార్ ఆదేశాల మేరకు ఒక్కో మండలానికి ప్రత్యేకాధికారిని నియమించి భూముల రికార్డులను పరిశీలిస్తోంది. ఇది పూర్తి కాగానే గ్రౌండ్ వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించి కబ్జాల లెక్క తేల్చనున్నారు. - సాక్షిప్రతినిధి, సంగారెడ్డి



జిల్లాలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల లెక్క తేల్చే పనిలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. ఎంత విస్తీర్ణంలో ప్రభుత్వం భూములున్నాయి.. ఎక్కడెక్కడ ఉన్నాయి.. ఇందులో ఎంత విస్తీర్ణంలో కబ్జాకు గురైంది.. వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై జిల్లా రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. ఇందుకోసం ఒక్కో మండలానికి ఒక్కో ప్రత్యేక అధికారిని నియమించారు. ఈ అధికారి నేతృత్వంలో క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది ఆయా మండలంలోని ప్రభుత్వ భూముల రికార్డులన్నింటిని పరిశీలిస్తున్నారు. గ్రామాల వారీగా, సర్వే నంబర్ల వారీగా రికార్డు వెరిఫికేషన్ చేస్తున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ భూములు చాలావరకు అన్యాక్రాంతమయ్యాయి. దశాబ్ద కాలంలో రూ.కోట్లు విలువ చేసే వందలాది ఎకరాలు పరాధీనంలోకి వెళ్లిపోయాయి. రాజకీయ నేతలే బినామీ పేర్లతో జిల్లాలో పెద్ద ఎత్తున భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రధానంగా హెచ్‌ఎండీ పరిధిలోని అమీన్‌పూర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు, బొల్లారం, గుమ్మడిదల, కంది, సంగారెడ్డి, సదాశివపేట్ తదితర మండలాల్లో రూ.వేల కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను కబ్జా చేశారు. కొందరు రెవెన్యూ అధికారుల సహకారంతో రూ.కోట్లు విలువ చేసే భూములను చెరబట్టారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల వెరిఫికేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలిస్తున్నారు.

ఫీల్డ్ విజిట్..

ప్రభుత్వ భూముల రికార్డుల పరిశీలన పూర్తయ్యాక.. గ్రౌండ్ వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహిస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. రికార్డు ప్రకారం ప్రభుత్వ భూమి ఎంత ఉంది.. క్షేత్ర స్థాయిలో ఎంత ఉంది.. ఎంత కబ్జాలకు గురైందనే దానిపై ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తామని అధికారులు చెబుతున్నారు. రికార్డులకు.. ఫీల్డ్ వెరిఫికేషన్ రెండు ప్రక్రియలు పూర్తయితే ప్రభుత్వ భూముల కబ్జాల లెక్క ఓ కొలిక్కి వస్తుందని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.

రికార్డులు గల్లంతు

జిల్లాలో ప్రభుత్వ భూములకు సంబంధించిన కీలక రికార్డులు చాలావరకు మాయమయ్యాయి. ప్రస్తుత రికార్డుల వెరిఫికేషన్‌లో ఈ విషయం వెలుగు చూస్తోంది. భూ కబ్జాలన్నీ స్థానిక రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరిగాయనే విమర్శలు ఉన్నాయి. కొందరి అధికారుల పూర్తి సహకారంతోనే రూ.కోట్లు విలువ చేసే భూములను బడా బాబులకు కట్టబెట్టారని ఆరోపణలున్నాయి. హెచ్‌ఎండీఏ పరిధిలో పని చేసిన కొందరు తహసీల్దార్లు ఈ కబ్జాల వ్యవహారంలో రూ.కోట్లకు పడగలెత్తారు. బినామీల పేర్లతో పెద్ద ఎత్తున ఆస్తులు కూడగట్టుకున్నారు. వీరి కనుసన్నల్లోనే కబ్జాలన్నీ జరిగాయనేది బహిరంగ రహస్యం. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రభుత్వ భూముల వెరిఫికేషన్‌లో రికార్డులు మాయం కావడం వెనుక ఈ రెవెన్యూ అధికారుల హస్తం ఉందనే విమర్శలు గుప్పుమంటున్నాయి. విలువైన భూముల రికార్డులను భద్రంగా ఉంచాల్సిన రెవెన్యూ అధికారులు కొందరు కబ్జాదారులతో కుమ్మక్కై మాయం చేశారనే విమర్శలున్నాయి.

అసంపూర్తిగా వంతెన నిర్మాణం

కంది(సంగారెడ్డి): మండల పరిధిలో గల ఓడియఫ్ నుండి ఇంద్రకరణ్ వెళ్లే దారిలో వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. బ్రిడ్జి ఏర్పాటుకు ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. 9 నెలల క్రితం నిర్మాణ పనులు ప్రారంభమైనా ఇప్పటివరకు పూర్తి కాలేదు. వాహనాల రాకపోకల కోసం తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు. దానిపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణ పనులు

కారులో మత్తు పదార్థాల పట్టివేత



ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితులు

జహీరాబాద్: గోవా నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు తీసుకువస్తున్న 4.2 గ్రాముల చెరస్ (గంజాయికి సంబంధించిన మత్తు పదార్థం)ను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం జహీరాబాద్ సమీపంలోని ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద 65వ జాతీయ రహదారిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ కారులో సోదాలు నిర్వహించగా ఇద్దరు వ్యక్తుల వద్ద చెరస్ లభించింది. దాని విలువ రూ.40వేలు ఉంటుందని ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న వారు హైదరాబాద్‌కు చెందిన అశ్రిత్ యాదవ్, ఆశిష్‌లుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి, కారును స్వాధీనం చేసుకుని స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, చెక్ పోస్టు, డీటీఎఫ్ బృందాలు పాల్గొన్నాయి.

అదనపు బస్సులు నడపాలని వినతి

సంగారెడ్డి టౌన్ : మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు వేయడం వల్ల జిల్లాలో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని.. వారికోసం అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం ఆర్టీసీ ఆర్‌ఎం ప్రభులతకు జిల్లా కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.సంగారెడ్డి నుంచి పఠాన్‌చెరు, జహీరాబాద్, నర్సాపూర్ రూట్లలో బస్సులు రాక ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందన్నారు. అంతేకాకుండా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పాండు, మల్లికార్జున్, రాజు పాల్గొన్నారు.



ఆర్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రూ.55.78 కోట్లతో అమీన్‌పూర్ బడ్జెట్



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అధ్యక్షతన సోమవారం వార్షిక బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. రూ.55.78 కోట్లతో అంచనా బడ్జెట్‌ను రూపొందించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మొత్తం బడ్జెట్‌లో పన్ను రాబడి రూ.2800 లక్షలు, పన్నేతర రాబడి రూ.2778.30 లక్షలు ఆదాయం రానుందని, 2023–2024 ఆర్థిక సంవత్సరానికి రూ.60.71లక్షలు మిగులు ఆదాయం ఉంటుందని అంచనా వేశారు.

బడ్జెట్ వివరాలు..

సమస్యల ప్రాధాన్యతను గుర్తించి నిధులను ఖర్చు చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ చెప్పారు. పొరుగు సేవల(ఔట్ సోర్సింగ్) ఉద్యోగుల జీత భత్యాలకు రూ.900 లక్షలు, పారిశుధ్య నిర్వహణకు రూ.535లక్షలు, కరెంటు బిల్లులకు రూ.90లక్షలు, రుణ వాయిదాల చెల్లింపులకు రూ.30లక్షలు, హరిత హారం పనులకు రూ.557.80 లక్షలు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. చార్జ్‌డ్ వ్యయాలకు రూ.2112.80 లక్షలు, ఇతర నిర్వహణ ఖర్చులకు రూ.487.10 లక్షలు కేటాయించారు. మిగిలిన పురపాలక సంఘ సొంత నిధులలో 1/3వ వంతు నిధులు రూ.992.83 లక్షలను పురపాలక సంఘంలోని అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. మిగిలిన నిధులను పార్కులు, వైకుంఠధామాల అభివృద్ధి, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, సమీకృత సంతల అభివృద్ధి, జంతువధ శాలల నిర్మాణం, డంపు యార్డుల నిర్వహణకు, వార్డులలో అభివృద్ధి పనులకు రూ.1930.00 లక్షలు కేటాయించారు. రూ.60.71 లక్షలను అంచనా మిగులుగా చూపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి గ్రాంట్ల రూపంలో రూ. 369.91 లక్షలుగా వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

సంగారెడ్డి అర్బన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.చెన్నయ్య, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా అన్నారు. సోమవారం ప్రధాన కార్యదర్శి భిక్షం గౌడ్‌తో కలిసి స్థానిక బాలుర, బాలికల ప్రభుత్వ పాఠశాలలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రధానంగా ఎదుర్కొంటున్న జీఓ 317, పదోన్నతులు, బదిలీలు, సీపీఎస్ రద్దు తదితర సమస్యలను పరిష్కరానికి పీఆర్టీయూ ముందుంటదని ఆయన పేర్కొన్నారు.



బాలికల పాఠశాలలో డైరీలను అందిస్తున్న నాయకులు

నియోజకవర్గ అభివృద్ధి నా బాధ్యత



పాలిటెక్నిక్ కళాశాలలో మాట్లాడుతున్న మంత్రి

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి : విద్యార్థులు మంచి అలవాట్లు, నడవడికతో జ్ఞానం సంపాదించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వైద్యారోగ్య శాఖ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆకాంక్షించారు. సోమవారం చౌటకూర్ మండలం శివంపేటలోని పాలిటెక్నిక్ కళాశాల, సుల్తాన్పూర్‌లో ఉన్న జేఎన్టీయూ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్టీయూ వస్తే ఈ ప్రాంతం విద్యార్థులకు ఉన్న విద్య అందుతుందనే సదుద్దేశంతో అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో దీనిని తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గం, సింగూరు ప్రాంతం అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జేఎన్టీయూ కళాశాలలో రూ.78.27లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, కాలేజీ ప్రధాన కాంపౌండ్ వాల్ నిర్మాణానికి, శివంపేట పాలిటెక్నిక్ కళాశాలలో కాంపౌండ్ వాల్, సీసీ రోడ్డు నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కళాశాల విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. వారికి కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు.

కళాశాలలో 4గంటలు..

దామోదర రాజనర్సింహ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జేఎన్టీయూ కళాశాల నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి ఆయన ఇక్కడికి రాలేదు. సోమవారం మంత్రి కళాశాల వచ్చారు. నాలుగు గంటలపాటు కాలేజీ ఆవరణలో గడిపారు. రోడ్లు, సోలార్ పవర్ ప్లాంట్లను పరిశీలించారు. అలాగే సోలార్ పవర్ ప్లాంట్‌కు ప్రత్యేక కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాలని కళాశాల అధికారులకు సూచించారు. అనంతరం కళాశాలలో ల్యాబ్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, కలెక్టర్ వల్లూరి క్రాంతి, జేఎన్టీయూ కళాశాల వైస్ చాన్సలర్ కట్ట నరసింహారెడ్డి, ప్రిన్సిపాల్ నరసింహన్, ఆర్డీఓ పాండు, దుర్గారెడ్డి, నత్తి దశరథ్, సుభాష్ రెడ్డి, గోవర్ధన్, వినయ్‌గౌడ్, పర్కల రాంరెడ్డి, సాయిలు, ఈశ్వర్ గౌడ్, సారా గోవర్ధన్, రామ్ చందర్ రెడ్డి, కిరణ్ గౌడ్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ పై మంత్రి ఆగ్రహం

వట్‌పల్లి(అందోల్): అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో చదువుకునే విద్యార్థినిలకు రక్షణ ఏదని..? కళాశాల నిర్వహణ ఇలాగేనా ఉండేదని మంత్రి దామోదర ప్రిన్సిపాల్ స్పందనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అందోల్ మండలం సంగుపేటలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీ నిర్మాణం, సీసీ రోడ్డు ఏర్పాటు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కళాశాల పరిసరాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రహరీకి, డార్మెటరీకి వెళ్లే దారిలో లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని వావిలాల పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌రెడ్డిపై డైరెక్టర్లు అవిశ్వాసాన్ని ప్రకటించారు. తీర్మాన పత్రాన్ని సోమవారం సహకార సంఘం జిల్లా అధికారికి అందించారు. మొత్తం 13 డైరెక్టర్ స్థానాలు ఉండగా, 8మంది బీఆర్‌ఎస్, ఐదుగురు కాంగ్రెస్‌కు చెందిన వారున్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన చైర్మన్ పనితీరు సరిగా లేదని ఆరోపిస్తూ ఏడుగురు అవిశ్వాసం పెట్టారు.

బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే

నారాయణఖేడ్: ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.విజయపాల్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులు బీజేపీలో చేరారు. సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో కాషాయం తీర్థం పుచ్చుకున్నారు. గతంలో బీజేపీలో ఉన్న విజయపాల్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌లో చేరారు. మళ్లీ ఆయన సొంతగూటికి చేరుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, నాయకులు అమర్‌సింగ్ పవార్, మారుతిరెడ్డి, శివాజీరావుపాటిల్ పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డితో విజయపాల్‌రెడ్డి

క్లుప్తంగా

ఆటో డ్రైవర్ అదృశ్యం


బురాన్

పటాన్‌చెరు టౌన్: కుమారుడి అదృశ్యంపై తల్లి ఫిర్యాదు చేసింది. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని గండిగూడెంకు చెందిన మహబూబ్ బీ–ఖాజామీయా చిన్న కుమారుడు బురాన్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే ఈ నెల 17న ఆటోతో ఇంటి నుంచి వెళ్లిన బురాన్ తిరిగి రాలేదు. దీంతో బురాన్ కుటుంబ సభ్యులకు ఆటో యజమాని రమేశ్ ఫోన్ చేసి మీ కుమారుడి ఫోన్ కలవడం లేదని, వస్తే చెప్పండి అని సూచించాడు. దీంతో కంగారుపడిన కుటుంబసభ్యులు బురాన్ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి మహబూబ్‌బీ పోలీసులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తీగలు చోరీ


వెంచర్‌లో చోరీకి గురైన విద్యుత్ తీగలు

కొండపాక(గజ్వేల్): మండలంలోని రవీంద్రనగర్, విశ్వనాథపల్లి పంచాయతీ పరిధిలోని మహాశక్తినగర్ కాలనీలోని వెంచర్‌లో 70 విద్యుత్ స్తంభాల తీగలను ఆదివారం రాత్రి దొంగలు అపహరించారు. వీటి విలువ సుమారు రూ. 30 లక్షల వరకు ఉంటుందని విద్యుత్ అధికారులు అంచనా వేస్తున్నారు. దొంగతనం జరిగిన ప్రదేశం నుంచి రవీంద్రనగ్ గ్రామం సుమారు 600 మీటర్ల దూరంలోనే ఉంది. తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉండారని వెంచర్‌లో ప్లాంట్లను కొనుగోలు చేసిన వారు అనుమానం వ్యక్తం చేశారు. ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్ తీగలు చోరీకి గురి కావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈవిషయమై బాధితులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

మిరుదొడ్డి(దుబ్బాక): ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పరశురాములు తెలిపారు. మిరుదొడ్డి శివారులోని నాగయ్య వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న కనకయ్యపై కేసు నమోదు చేశామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆయిల్ పామ్ పంటపై అడవి పందుల దాడి

ఝరాసంగం(జహీరాబాద్): సాగులో ఉన్న ఆయిల్ పామ్ పంటపై అడవి పందుల దాడి చేశారు. మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామానికి చెందిన రైతు చంద్రమ్మ ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్నారు. రెండు మూడు రోజుల నుంచి అడవి పందులు గుంపులుగా వచ్చి దాడులు చేశాయి. ఈ దాడుల్లో సుమారు 70 వరకు మొక్కలు నాశనం అయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఈ విషయాన్ని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లగా.. సోమవారం పంటను పరిశీలించి వివరాలు సేకరించారు.

మినీ మేడారం.. సర్వం సిద్ధం

జాతరకు ఏర్పాట్లు పూర్తి
- సమ్మక్క, సారలమ్మ గద్దెల ముస్తాబు
- ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు

సిద్దిపేట జిల్లాలో మినీమేడారం జాతరకు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 21వ తేదీ నుంచి మేడారంలో ప్రారంభమయ్యే సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లలేని భక్తులు ఇక్కడ దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకుంటారు. నంగునూరు, కొహెడ, బెజ్జంకి, హుస్నాబాద్, మద్దూరు, చిన్నకోడూరు, కొమురవెల్లి తదితర ప్రాంతాల్లో అమ్మవార్ల గద్దెలను ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహణ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి.


అక్కేనపల్లిలో జాతరకు ముస్తాబైన సమ్మక్క, సారలమ్మ గద్దెలు

నంగునూరు: రెండేళ్లకొకసారి వచ్చే సమ్మక్క, సారలమ్మ జాతరకు నంగునూరు మండలం అక్కేనపల్లిలోని సమ్మక ఆలయ ప్రాంగణం ముస్తాబైంది. గ్రామంలో మూడు దశాబ్దాలుగా జాతర నిర్వహిస్తున్నారు. మేడారం వెళ్లలేని భక్తుల కోసం సమ్మక్క, సారలమ్మలు గద్దెలను ఎక్కే ఘట్టాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది తరలి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించారు. మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులు ఉండేందుకు గుడిసెలు వేయడంతో పాటు ఉచితంగా వంట చెరుకు, నీటి వసతి, వైద్య సదుపాయం ఏర్పాటు చేశారు. బుధవారం సారలమ్మను, గురువారం సమ్మక్కను గద్దెకు తెచ్చే కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహిస్తామని ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం భక్తులు ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకోచ్చని పేర్కొన్నారు. గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు ఒగ్గుకథ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

జాతరకు బీజం పడింది ఇలా..

అక్కేనపల్లి గ్రామ శివారులో ఉన్న పులిగుండ్ల ప్రాంతంలో 30 సంవత్సరాల కిందట గొర్రెల కాపరి మేకలను మేపుతుండగా పెద్ద గుండు వద్ద పసుపు ముద్దలు, కుంకుమ కనిపించాయి. మేడారంలోని సమ్మక్క, సారలమ్మ జాతర జరిగే కొన్ని రోజుల ముందు ఈ సంఘటన జరగడంతో వన దేవతల మహిమగా గ్రామస్తులు భావించారు. మేడారంలో జాతర నిర్వహిస్తున్న సమయంలోనే వేడుకలు జరిపించాలని పూనకం వచ్చిన మహిళ చెప్పడంతో గ్రామంలో ఆలయ నిర్మాణం చేపట్టాలని సంకల్పించారు. చందాలు పోగు చేసి పులిగుండ్ల సమీపంలో 14 ఎకరాల స్థలాన్ని సేకరించారు. 1994లో సమ్మక్క, సారలమ్మ గద్దెలు, వారి మేనకోడలు లక్ష్మి, వడిగిద్దరాజు (నాగుపాము) ప్రతిమలను ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతి రెండేళ్లకోసారి మేడారంలో నిర్వహించే విధంగా అదే మూహుర్తాన జాతరను నిర్వహించడం ఆనవాయితీగా మారింది. మొక్కు తీర్చుకునేవారు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి, అమ్మవార్లకు ఒడి బియ్యం పోసి పూజలు నిర్వహిస్తారు. కోళ్లను ఎదుర్కోళ్లుగా వేసి గొర్రెలు, మేకలను బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం బంధువులతో కలసి అక్కడే భోజనాలు చేసి తిరుగు ప్రయాణం చేస్తారు.

కోయవారే ప్రధాన అర్చకులు


జాతరకు సిద్ధంగా ఉన్న గద్దెలు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని కూటిగల్ గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతరను కోయవారే ప్రధాన అర్చకులుగా ముందుండి నడిపిస్తారు. మేడారం వెళ్లలేని భక్తులు తమ మొక్కులను ఇక్కడే అమ్మవార్లకు చెల్లిస్తారు. సిద్దిపేట, జనగామ, మెదక్, హన్మకొండ, కరీంనగర్ తదితర జిల్లాలకు చెందిన భక్తులు ఇక్కడికి వచ్చి అమ్మవార్ల దర్శించుకుంటారు. జాతరకు వచ్చే భక్తులకు ఇక్కడ స్నానాల కోసం నల్లా చెరువు వద్ద ఘాట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భక్తులకు మరుగుదొడ్లు కూడా జాతర నిర్వాహకులు ఏర్పాట్లు చేయలేదు.

గద్దెల ముస్తాబు

హుస్నాబాద్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సమీపంలో ప్రతి రెండేళ్లకొకసారి సమ్మక్క సారలమ్మ జాతర జరగనుంది. జాతర నిర్వహణ కోసం ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజుల గద్దెలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. గద్దెల ఆవరణలో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులకు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. జాతర జరిగే ప్రాంతాన్ని చదును చేశారు. అక్కడక్కడ చలువ పందిర్లు వేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ స్థలంతో పాటుగా కొబ్బరి కాయలు, పూజా సామానుల వివిధ దుకాణాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం, లైటింగ్ సిస్టమ్ ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు.


హుస్నాబాద్‌లో సమ్మక్క సారమ్మల గద్దెలు

పరివేదలో నాలుగు రోజులు

కోహెదరూరల్ (హుస్నాబాద్): మండలంలోని పరివేద, వింజపల్లి, తంగళ్లపల్లి గ్రామాల్లో సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల గద్దెలను రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. భక్తుల కోసం క్యూలైన్లు, కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. మోయతుమ్మద వాగు సమీపంలో స్నానాలు చేసేందుకు నీటి సౌకర్యంతో పాటు స్నాపు గదులను ఏర్పాటు చేస్తున్నారు. జాతర ప్రాంగణంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గడ్డి, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. ఈ జాతరకు కొహెడ, బెజ్జంకి, హుస్నాబాద్, చిగురుమామిడి మండలాలతో పాటు ఇతర ప్రాంతాలను నుంచి వచ్చి భక్తులు భారీగా తరలివస్తారు. మేడారం కోయ పూజారులచే ఈ జాతర నిర్వహిస్తారు.

2002 నుంచి జాతర

4 మండలాల నుంచి భక్తుల రాక


కొమురవెల్లి కమాన్ వద్ద గద్దెలు

కొమురవెల్లి(సిద్దిపేట): సమ్మక్క, సారలమ్మ జాతరకు మేడారం సిద్ధమవుతుండగా మండలంలోని కొమురవెల్లిలో ఉన్న గద్దెలు అమ్మవార్ల జాతరకు సిద్ధమవుతున్నాయి. 2002లో మండల కేంద్రానికి చెందిన చింతల రామ్మూర్తి అమ్మవార్ల జాతరకు పునాది వేశారు. కొమురవెల్లి పాత కమాన్ సమీపంలో అమ్మవార్ల గద్దెలను స్వయంగా తానే ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు రామ్మూర్తి ఆధ్వర్యంలోనే పదిసార్లు జాతర కొసాగింది. అయితే.. కొద్దిరోజుల క్రితం ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. ఈనెల 21 నుంచి జరిగే జాతర అతని కూతురు రేణుక ఆధ్వర్యంలో జరగనుంది. ఈ జాతరకు కొమురవెల్లి, చేర్యాల, కొండపాక, కుకునూరుపల్లి గ్రామాల నుంచి భారీగా భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుంటారు. అలాగే.. ఆరేళ్ల క్రితం మండలంలోని పోసానిపల్లిలో కూడా సమ్మక్క–సారలమ్మ జాతర కోసం గద్దెలను ఏర్పాటు చేసి జాతరను కొనసాగిస్తున్నారు.

ఒడిబియ్యం పోసి..


దేవక్కపల్లెలో సమ్మక్క సారలమ్మ జాతర కోసం చేసిన ఏర్పాట్లు

బెజ్జంకి (సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లెలోని మోయతుమ్మెద వాగు శివారులో ప్రశాంత వాతావరణంలో ఐదు రోజుల పాటు ప్రతి ఏటా ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. బెజ్జంకి, కోహెడ, గన్నేరువరం మండలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుంటారు. ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకుంటారు. కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. భక్తుల సౌకర్యం కోసం రోడ్డు, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సంజీవరెడ్డి తెలిపారు.

భక్తుల కొంగుబంగారం


కిష్టాపూర్‌లో ముస్తాబైన గద్దెలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కిష్టాపూర్‌లో జరిగే సమ్మక్క– సారలమ్మ జాతర కొలిచే భక్తుల కొంగు బంగారంగా నిలుస్తోంది. 15 సంవత్సరాల నుంచి ఈ జాతర కొనసాగుతోంది. చిన్నకోడూరు, ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

కాళేశ్వరం.. తెలంగాణకు గుండెకాయ

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌ను బద్నామ్ చేసేందుకు కుట్ర
- హామీలను పక్కదోవ పట్టించేందుకే..


దుబ్బాకలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: కరువు కాటకాలకు నిలయమైన తెలంగాణలో శాశ్వతంగా కరువును దూరం చేసి సస్యశ్యామలం చేసేందుకే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించినట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక, అక్బర్‌పేట–భూంపల్లి, తొగుట మండలాల్లోని 154 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు గుండెకాయగా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం పనిగట్టుకొని అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు మూలంగానే మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయక సాగర్, కూడవెల్లి, హల్దీ వాగులకు నీళ్లొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా పక్కదారి పట్టించేందుకే బీఆర్‌ఎస్‌ను బద్నామ్ చేసే పని పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు న్యాయం చేసింది కేసీఆరే

దివ్యాంగులకు అన్ని విధాలుగా న్యాయం చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం దుబ్బాకలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 20 మంది దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్స్‌ను పంపిణీ చేశారు. దివ్యాంగుల కష్టాలను గుర్తుపెట్టుకొనే కేసీఆర్ ప్రభుత్వం రూ.4,016 ఫించన్‌ను అమలు చేసిందన్నారు. దివ్యాంగులకు ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు తాను అన్ని విధాలుగా కృషి చేస్తానన్నారు.

అంగన్‌వాడీలు అంకిత భావంతో పని చేయాలి

అంగన్‌వాడీలు అంకిత భావంతో పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు కొత్త డ్రెస్‌లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటానని చెప్పారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత ఎంపీపీ కొత్త పుష్పలత, ,జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో సైబర్ మోసం

- రూ.10 లక్షలు ఒకరు.. 8లక్షలు మరొకరు.
- పోగొట్టుకున్న బాధితులు

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో ఓ వ్యక్తి రూ.10 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని కిష్టారెడ్డిపేటకు చెందిన మొబైల్ షాప్ వ్యాపారికి గతేడాది నవంబర్ 15వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించిన ఒక ఫోన్ కాల్ వచ్చింది. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఒక ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో సదరు వ్యాపారి నగదును ఆన్‌లైన్ ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. పెట్టిన నగదుతో పాటు, కమీషన్ చూపిస్తూ అపరిచిత వ్యక్తి వచ్చాడు. అయితే బాధితుడు పలు దఫాలుగా రూ.10 లక్షలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడగగా వారు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, అనంతరం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పటేల్‌గూడలో మెకానికల్ ఇంజనీర్

అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడకు చెందిన మెకానికల్ ఇంజనీర్‌కి గత ఏడాది అక్టోబర్ 28న ట్రేడింగ్‌కు సంబంధించిన మెసేజ్ టెలిగ్రామ్ ద్వారా వచ్చింది. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఒక ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఆ మెకానికల్ ఇంజనీర్ నగదును ఆన్‌లైన్ ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. అయితే బాధితుడు పలు దఫాలుగా రూ.8 లక్షల 29 వేలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడగగా.. అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, తర్వాత అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పార్ట్ టైం ఉద్యోగం పేరిట దగా

- రూ.2.74 లక్షలు పోగొట్టుకున్న
- ఇద్దరు బాధితులు

సిద్దిపేటకమాన్: పార్ట్ టైం జాబ్ పేరిట గుర్తు తెలియని వ్యక్తి నుంచి వచ్చిన ఫోన్ కాల్‌కు స్పందించి ఇద్దరు వ్యక్తులు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపించి సైబర్ మోసానికి గురయ్యారు. ఈ సంఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. సీపీ అనురాధ కథనం ప్రకారం.. సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి పార్ట్ టైం ఉద్యోగం ఉందని ఓ లింకును పంపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు తన వివరాలు నమోదు చేయగానే. అతడి నంబర్‌ను ఇన్వెస్టిమెంట్ టెలిగ్రామ్ యాప్‌కు బదిలీ చేశారు. అందులో పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి సూచించాడు. దీంతో బాధితుడు మొదటగా రూ.3వేలకు రూ.6వేలు, రూ.10వేలకు రూ.20వేలు లాభాలు వచ్చాయి. తర్వాత పలు విడతలుగా మొత్తం రూ.2,09,550 పెట్టుబడిగా పెట్టగా తర్వాత లింకు ఓపెన్ చేసి చూడగా బ్లాక్ చేసి ఉండటంతో అనుమానంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో మరొక వ్యక్తి కూడా ఇదే తరహాలో రూ.64,550 పెట్టుబడిగా పెట్టి సైబర్ మోసానికి గురయ్యాడు. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్ లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

స్కూటీని ఆపి.. ఉంగరాలు చోరీ


విచారణ చేస్తున్న పోలీసులు

చేగుంట(తూప్రాన్): స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు ఆపి ఉంగరాలు దొంగిలించిన సంఘటన చేగుంట శివారులోని రెడ్డిపల్లి బైపాస్ బ్రిడ్జి వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రామచంద్రం స్కూటీపై చేగుంటకు వస్తున్నాడు. ఈ క్రమంలో రెడ్డిపల్లి బ్రిడ్జివద్ద రెండు బైకులపై వచ్చిన వ్యక్తులు పోలీసుల పేరుతో అతన్ని ఆపి, మాటల్లో దింపి చేతి వేళ్లకు ఉన్న రెండు బంగారు ఉంగరాలు బలవంతంగా లాక్కొని పారిపోయారు. బాధితుడు వెంటనే చేగుంట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటేశ్, చేగుంట ఎస్‌ఐ బాలరాజు సంఘటన స్థలాన్ని చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగల వేటలో పోలీసులు

- ముగ్గురు సభ్యుల ముఠా పనే..
- కర్ణాటక వాసులుగా నిర్ధారణ

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలో కలకలం రేపిన దొంగతనాల కేసును ఛేదించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. కర్ణాటక పోలీసులతో కలిసి దొంగలను పట్టుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఆదివారం తెల్లవారుజామున జహీరాబాద్ పట్టణంలో ముగ్గురు సభ్యుల దొంగల ముఠా గంట వ్యవధిలోనే ఏకంగా 11 ప్రాంతాల్లో చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. రెండు మద్యం దుకాణాలు, రెండు కిరాణ షాపులు, మూడు బట్టల దుకాణాలు, ఒక బ్యాంగిల్ స్టోర్, మూడు ఇళ్లలో ఈ ముఠా దొంగతనాలకు పాల్పడింది. మోటారు సైకిల్‌పై వచ్చి దొంగతనాలు పాల్పడి పరారైంది. వీరిని కర్ణాటక ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దొంగలను పట్టుకునేందుకు కర్ణాటక పోలీసుల సహకారం తీసుకుంటున్నారు. ఇప్పటికే వారిని ఆశ్రయించి సమాచారం సేకరించారు. దొంగతనాలకు పాల్పడిన ముఠా కర్ణాటకలోని చించోళి, బీదర్, గుల్‌బర్గా, బస్వకల్యాణ్ ప్రాంతాల్లో 9 దొంగతనాలకు పాల్పడినట్లు, జహీరాబాద్‌లో పాల్పడిన దొంగతనం పదోకేసుగా పోలీసులు పేర్కొంటున్నారు. వీరు చేసిన దొంగతనాలు ఒకే తరహాలో ఉన్నట్లు గుర్తించారు. కర్ణాటకలో జరిగిన దొంగతనం తీరులోనే జహీరాబాద్‌లో జరిగిన దొంగతనాల తీరు ఉందని వారంటున్నారు. కేవలం క్యాష్ కౌంటర్‌లనే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. జహీరాబాద్‌లో రెండు మద్యం దుకాణాల్లో జరిగిన దొంగతనాల్లో వారు ఒక్క మద్యం బాటిల్ కూడా ముట్టుకోకుండా క్యాష్ కౌంటర్ వద్దకే వెళ్లి డబ్బు తీసుకొని ఉడాయించిన తీరు సీసీ పుటేజీలను బట్టి తెలుస్తోంది. లక్షలాది రూపాయల విలువ గల మద్యంతో పాటు ఆయా దుకాణాల్లో ఖరీదైన బట్టలు, కిరాణా సామగ్రి ఉన్నా వాటిని ముట్టుకోలేదు. సుదీర్ఘ కాలం తర్వాత జహీరాబాద్ ప్రాంతంలో దొంగతనాలు జరగడం కలకలం రేపింది. జర్నలిస్టు కాలనీలో మూడు తాళం వేసిన వాటిని తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. చోరీకి గురైన వ్యాపార సంస్థలో వ్యాపారులు నగదును ఉంచకపోవడంతో పెద్దగా డబ్బు దొంగతనం జరగలేదు.

ప్రాంతాలను మార్చుతూ..

దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా ప్రాంతాలను మార్చుతూ దొంగతనాలు చేస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎలాంటి రెక్కీ నిర్వహించకుండానే దొంగతనాలు చేస్తున్నట్లు ఆయా ప్రాంతాల్లో జరిగిన దొంగతనాల తీరును బట్టి తెలుస్తోంది. ముఠా సభ్యులు దొంగతనాలు చేయడంలో ప్రావిణ్యులుగా ఆరితేరినట్లు భావిస్తున్నారు.


సీసీ పుటేజీలో నమోదైన దొంగలు

త్వరలో పట్టుకుంటాం

జహీరాబాద్‌లో దొంగతనాలకు పాల్పడిన ముఠాను త్వరలోనే పట్టుకుంటాం. ముఠా సభ్యులు కర్ణాటక ప్రాంత వాసులుగా నిర్ధారణకు వచ్చాం. అక్కడ ఇప్పటి వరకు తొమ్మిది చోట్ల ఇదే తరహాలో దొంగతనాలకు పాల్పడ్డారు. అక్కడి పోలీసుల సహకారంతో కేసును ఛేదిస్తాం. ఇప్పటికే వారి సహకారంతో దొంగతనాల తీరును గుర్తించాం. ముగ్గురు సభ్యుల ముఠానే దొంగతనాలకు పాల్పడింది.

–రవి, సీఐ–జహీరాబాద్